క్లుప్తంగా

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్, దేశరాజుపల్లి గ్రామ శివారుల్లోని రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని దుండగులు సోమవారం రాత్రి ధ్వంసం చేసి రూ.44,200 విలువైన కాపర్‌వైరు, ఆయిల్‌ను చోరీ చేశారు. ఉప్పల్ సెక్షన్ ఏఈ కె.సంపత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పల్, దేశరాజుపల్లి గ్రామాల శివారుల్లోని పంట పొలాల వద్ద వ్యవసాయ విద్యుత్ కోసం అమర్చిన ఎస్ఎస్ 40/25 కేవీఏ, ఎస్ఎస్ 86/25 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసి రెండు ట్రాన్స్‌ఫార్మర్లలోని 40 కిలోల కాపర్ వైరును, వంద లీటర్ల ఆయిల్ అపహరించినట్లు తెలిపారు. చోరీ అయిన కాపర్ వైరు, ఆయిల్ విలువ రూ.44,200 ఉంటుందని తెలిపారు. టీఎస్ ఎన్‌పీడీసీఎల్ ఉప్పల్ సెక్షన్ ఏఈఈ కె.సంపత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ పేర్కొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



దామెర: మండలంలోని పులుకుర్తిలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 7 గంటలకు స్వస్తి పుణ్యాహవాచనం, అష్టోత్తర శత కలశస్థాపన, ఆవాహన, ధ్వజకుంభ ఆరాధన, సహస్ర పత్రార్చన, యాగశాల ప్రవేశం, ఆవాహిత దేవతాహవనం, అధివాస హోమం, పూర్ణాహుతి, అష్టోత్తరం, శత ఘట్టాభిషేకం కార్యక్రమాలను వేద పండితులు, కొండగట్టు ఆలయ పూజారులు బిట్కూరి నవీన్‌చార్యులు, మరిగంటి శ్రీవత్సవ చార్యులు, తూపురాణి శ్రీనివాసచార్యులు, వినయ్‌కుమార్ చార్యులు, పులుకుర్తి ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల అఖిల్‌ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన, నివేద, తీర్థప్రసాద వితరణ, మహాదాశీర్వచనాలను సంప్రదాయ రీతిన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, టెంకాయలు, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మెంతుల రాజు పాల్గొన్నారు.

గురుకులానికి ఎంపిక

కమలాపూర్ : మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన పది మంది విద్యార్థులు ఇటీవల నిర్వహించిన తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చి సీట్లు సాధించారని స్కూల్ కరస్పాండెంట్ చల్లూరి ప్రభాకర్ తెలిపారు. కనుకుంట్ల తపస్వి, పబ్బు మనుశ్రీ, పోతిరెడ్డి తేజశ్రీ, నంద శ్రావ్య, కొలిపాక లక్ష్మీశ్రీజ, తొటం అన్విత, నకీర్త గౌతంకృష్ణ, కోవరాజు హర్ష, కోవరాజు శివచరణ్, నరిగె రిత్విక్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఉపాధ్యాయులు ఖాజామియా, సురేందర్, సుధారాణి, రజిత, మానస, భవాని, అరుణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అరకొరగా హాజరు..

- ఖాళీ కుర్చీల దర్శనం

దామెర : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సీనియర్ అసిస్టెంట్, 4 జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ గైర్హాజరయ్యారుకాగా ఒక జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు ఈజీఎస్ సిబ్బంది, ఒక కంప్యూటర్ ఆపరేటర్, ఒక అటెండర్ మాత్రమే విధుల్లో ఉన్నారు. పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన బాధితులు వెనుదిరిగారు. ఈ విషయమై ఎంపీడీఓ కల్పనను వివరణ కోరగా వివిధ పనుల నిమిత్తం బయటికి వెళ్లారని తేలికగా వివరణ ఇచ్చారు.

వ్యక్తిపై కేసు నమోదు

దామెర : వృద్ధురాలిపై కత్తితో దాడిచేసిన ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు. దామెర గ్రామానికి చెందిన గంగిడి రాజిరెడ్డి అదే గ్రామానికి చెందిన పోలం వాసురెడ్డికి దామెర గ్రామ శివారులో భూమిలేదు అన్నాడు. దీంతో వాసురెడ్డి కోసంతో రాజిరెడ్డి ఇంటికి కత్తితో దాడికి వెళ్లాడు. ఇంట్లో రాజిరెడ్డి లేకపోవడంతో ఆయన భార్య రాధమ్మ (68)పై కత్తితో దాడిచేశాడు. ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. రాధ భర్త రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు వాసుదేవరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సేవలను వినియోగించుకోవాలి

ధర్మసాగర్ : బాధిత మహిళలకు సఖి కేంద్రం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సఖి వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ వినీల కోరారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మంగళవారం ఆశాలకు, అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, రజిత, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు ఊతమేది?

- కమలాపూర్‌లో పేరుకుపోయిన చేనేత వస్త్ర నిల్వలు
- నాలుగు నెలలుగా నిలిచిన టెస్కో కొనుగోళ్లు
- గోదాముల్లో మూల్గుతున్న రూ.1.50 కోట్ల వస్త్రాలు
- చెల్లించని రూ.34 లక్షల బకాయిలు
- జీవనోపాధిపై చేనేత కార్మికుల ఆందోళన



కమలాపూర్ చేనేత సంఘంలో పేరుకుపోయిన వస్త్ర నిల్వలు

కమలాపూర్: చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను ఎప్పటికప్పుడు కొనాల్సిన తెలంగాణ స్టేట్ కో–ఆపరేటివ్ హ్యాండ్లూమ్ సొసైటీ (టెస్కో) కొనకపోవడంతో చేనేత వస్త్ర నిల్వలు పేరుకుపోతున్నాయి. నేత కార్మికులకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశ్యంతో కమలాపూర్ చేనేత పారిశ్రామికుల సహకార సంఘంలో రూ.కోట్లల్లో పెట్టుబడి పెట్టి వస్త్రాలను తయారు చేయిస్తే.. వాటి కొనుగోళ్లను టెస్కో నిలిపేసింది. దీంతో గోదాముల్లో సుమారు రూ.1.50 కోట్ల విలువైన చేనేత వస్త్ర నిల్వలు పేరుకుపోయాయి. దీనికి తోడు గతంలో కొన్న చేనేత వస్త్రాలకు సంబంధించిన రూ.34 లక్షల బకాయిలను సైతం టెస్కో చెల్లించకపోవడంతో ఇటు పెట్టుబడులు లేక, అటు మార్కెటింగ్ లేక గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్న చేనేత సంఘం మరి కొద్ది రోజుల్లో మూతపడి చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే దుస్థితి నెలకొంటోంది.

125 మగ్గాలు.. 250 మంది కార్మికులు

కమలాపూర్ చేనేత పారిశ్రామికుల సహకార సంఘం పరిధిలో కమలాపూర్, శ్రీరాములపల్లి, కరీంనగర్ జిల్లా కందుగుల గ్రామాల్లో చేనేత సంఘ ఉత్పత్తి కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో 125 మగ్గాలు ఉండగా.. కమలాపూర్, గూడూరు, వంగపల్లి, పంగిడిపల్లి, ఉప్పల్, దేశరాజుపల్లి, శ్రీరాములపల్లి, అంబాల, కంఠాత్మకూరు, కందుగుల తదితర గ్రామాలకు చెందిన 450 మంది సభ్యత్వాలు కలిగి ఉన్నారు. 250 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరంతా చేనేత సంఘంలో చెద్దర్లు, టవల్స్, లుంగీలు, చేతి రుమాళ్లు, దోమతెరలు, నవారు, షర్టింగ్, స్కూల్ డ్రెస్ మెటీరియల్ వంటివి కార్మికులు తయారు చేస్తారు.

జనవరి నుంచి నిలిచిన కొనుగోళ్లు..

చేనేత సహకార సంఘాల్లో కార్మికులు తయారు చేసిన చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాల్సిన టెస్కో ఈ ఏడాది జనవరి నుంచి వస్త్రాల్ని కొనుగోలు చేయడం లేదు. దీనికి తోడు టెస్కో గతంలో కొన్న వస్త్రాలకు సంబంధించి బకాయి ఉన్న రూ.34 లక్షలు కూడా చెల్లించడం లేదు. దీంతో నూలు ఖరీదు చేయలేక, కార్మికులకు కూలీలు చెల్లించలేని పరిస్థితుల్లో ఇప్పటికే పలు చేనేత సంఘాలు మూతపడగా.. కమలాపూర్ చేనేత సంఘం కూడా మరి కొద్ది రోజుల్లో మూతపడేలా కనిపిస్తోందని చేనేత కార్మికులు ఆందోళన చెందుతున్నారు.



కమలాపూర్‌లోని చేనేత సహకార సంఘం

పేరుకుపోతున్న చేనేత వస్త్ర నిల్వలు..

కమలాపూర్‌లో చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను నాలుగు నెలలుగా టెస్కో కొనుగోలు చేయకపోవడంతో గోదాముల్లో చేనేత వస్త్ర నిల్వలు పేరుకుపోతున్నాయి. కమలాపూర్ చేనేత సహకార సంఘంలోనే రూ.1.50 కోట్ల విలువైన వస్త్ర నిల్వలు గోదాముల్లో మూలుగుతున్నాయి. అధునాతన వస్త్రాల తయారీలో భాగంగా రామప్ప చీరలు తయారు చేయగా.. ప్రస్తుతం ఎలాంటి ఆర్డర్లు లేక రామప్ప చీరల తయారీ సైతం నిలిచిపోయింది.

ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదు



నేను 55 ఏళ్ల నుంచి ఇదే సంఘంలో కార్మికుడిగా పని చేస్తున్నా. నాకు చేనేత పని తప్ప మరో పని రాదు. నాలుగు నెలల నుంచి టెస్కో వాళ్లు చేనేత వస్త్రాలు కొనుగోలు చేస్తలేరు. ఇది ఇలాగే కొనసాగితే ఇంకో 20 రోజుల్లో కార్మికులకు పని లేక సంఘం మూతపడేలా ఉంది. అదే జరిగితే మా పరిస్థితి ఎట్లనో అర్థమైతలేదు. ఇన్నేళ్లలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదు. ప్రభుత్వం చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి వెంటనే డబ్బులు చెల్లించి చేనేత కార్మికులను ఆదుకోవాలె.

- చేరాల వెంకటపతి, చేనేత కార్మికుడు

మా కుటుంబాలు రోడ్డున పడతాయి..



కమలాపూర్ చేనేత సంఘంలో ఇప్పటికే రూ.కోటిన్నర విలువైన చేనేత వస్త్రాలు నిలువ ఉన్నాయని, టెస్కో నుంచి రావాల్సిన రూ.34 లక్షల బకాయిలు రావడం లేదంటున్నారు. ఇక నుంచి నూలు ఖరీదు చేయలేమని, కూలి పైసలు కూడా ఇచ్చే పరిస్థితి లేదంటాండ్లు. చేనేత పని తప్ప మాకు ఇంకో పని రాదు. పని లేక సంఘం మూతపడితే మా కుటుంబాలన్నీ రోడ్డున పడతాయి. ప్రభుత్వం చేనేత వస్త్రాలను కొని మమ్మల్ని ఆదుకోవాలి. చేనేత సంఘాన్ని కాపాడాలె.

- మామిడి సమ్మయ్య, చేనేత కార్మికుడు

ఆస్తుల కోసమే అరూరి తాపత్రయం

- ఎమ్మెల్యే సత్యనారాయణరావు



మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : అక్రమంగా సంపాదించిన ఆస్తులను కాపాడుకునేందుకే బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ తాపత్రాయ పడుతున్నాడని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆరోపించారు. మాందారిపేట గుట్టల్లో అక్రమ క్రషర్ల ద్వారా లెక్కలేనన్ని డబ్బు సంపాదించాడని విమర్శించారు. మండల కేంద్రంలోని ఎస్వీకేకే ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకున్న అరూరి రమేశ్ వరంగల్, హనుమకొండ పట్టణాల్లో ఇల్లీగల్ రియల్ ఎస్టేట్ చేస్తూ కోట్లకు పరిగెత్తాడని ఆరోపించారు. అక్రమ ఆస్తులను కాపాడుకునేందుకే బీజేపీలో చేరినట్లు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ఆదాని, అంబాని, కార్పొరేట్ శక్తులకు తలొగ్గి పని చేస్తుందని, వారు నిర్ణయించిన ధరలకే పంటలను కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆరోపించారు. మే 13 జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యను 3లక్షల మెజార్టీతో గెలిపించి బీజేపీకి గుణపాఠం చెప్పాలని కోరారు. భూపాలపల్లి నియోజకవర్గ పార్లమెంట్ ఇన్‌చార్జ్ వెంకటస్వామి, అధికారప్రతినిధి అశోక్, ఎంపీటీసీ చంద్రప్రకాశ్, పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ చక్రపాణి, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శాంతరవి, రవి, మార్కండేయ, రవిపాల్, ప్రకాశ్‌రెడ్డి, భాస్కర్, రమేష్, భిక్షపతి, ప్రపంచరెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి



మాట్లాడుతున్న భిక్షపతి

ఎల్కతుర్తి : అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రబీలో సాగుచేసిన వరి, మొక్కజొన్న పంటలకు చివరి దశలో నీరందక పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్రం ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పడంతో పాటు నల్లధనాన్ని వెలికితీసి ప్రతీ పౌరుడికి 15లక్షలు అందిస్తామని, రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, వ్యవసాయ కూలీలను ఆదుకుంటమాని చెప్పి ఉన్న ఉద్యోగాలను, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేటుకు అప్పనంగా కట్టబెట్టారని ఆరోపించారు. లక్షల కోట్ల రూపాయలు రాయితీల పేరుతో కేంద్రం కార్పొరేట్ రంగానికి అప్పగించి ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భారత రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ప్రజలకు ఉపయోగపడే విధంగా విద్యా, వైద్యం అందించడం కోసం పాటుపడే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, నాయకులు మనోహర్, మొండయ్య, రాజనర్సు, విజయ్, స్వామి పాల్గొన్నారు.

యూత్ నాయకులతోనే పార్టీ బలోపేతం

శాయంపేట : యూత్ నాయకులతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాదు నాగరాజు అన్నారు. మంగళవారం మండలంలోని 24గ్రామాలకు చెందిన కాంగ్రెస్ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాయంపేట టౌన్ అధ్యక్షుడిగా మారెపల్లి ఫీటర్, ప్రధానకార్యదర్శిగా కోల నాగరాజును ఎన్నుకున్నట్లు తెలిపారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, యూత్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, నియోజకవర్గ అధ్యక్షుడు ప్రసాద్ ఆదేశాల మేరకు ఈ ఎన్నిక చేపట్టినట్లు తెలిపారు.

వేసవి సెలవులను వినియోగించుకోవాలి



ప్రగతిపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఐనవోలు : వేసవి సెలవులను విద్యార్థులు నిర్మాణాత్మకంగా వినియోగించుకోవాలని హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం విద్యాశాఖ సూచనల మేరకు పీటీఏ సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ప్రగతిపత్రాలు అందజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలతో సరదాగా ఆటలాడటం, కథలు చెప్పడం, చెప్పించడం, వంటలకు సంబంధించిన తేలికైన పనులను జాగ్రత్తతో నేర్పించాలన్నారు. లోకజ్ఞానం, సమకాలీన అంశాలు, స్ఫూర్తి పొందే అంశాల గురించి ప్రస్తావిస్తూ వార్త పత్రికలు, టీవీలో వార్తలు వినిపించడం, చదివించడానికి ప్రోత్సహించాలని సూచించారు. అంకెలతో ఆట, చదువులో నైపుణ్యం పెంపొందించుకోవడం కోసం గ్రంథాలయ పుస్తకాలు చదివించడం, రోజువారి ఇంటి పనులను నేర్పించాలని అన్నారు. ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో బయటకు వెళ్లినపుడు గొడుగు లేదా టోపీ ధరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుకర్, బీమళ్ల సారయ్య, మహేందర్ రెడ్డి, లక్ష్మయ్య, మహేందర్, భవన్ కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయొద్దు



వంగరలో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

ఎల్కతుర్తి : ధాన్యం కొనుగోళ్ల విషయంలో జాప్యం చేయొద్దని డీఆర్‌డీఓ నాగపద్మజ అన్నారు. భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రం, రైతువేదిక, నర్సరీలను, గట్లనర్సింగాపూర్ రైతువేదిక, స్కూల్ టాయిలెట్స్ నిర్మాణ పనులు, కొత్తకొండలో ధాన్యం కొనుగోలు కేంద్రం, అమ్మ ఆదర్శ పాలన ప్రోగ్రెస్‌వర్క్స్ పనులు, కుట్టు శిక్షణా కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని నర్సరీలను చూసి సంతృప్తి చెందారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగకుండా కాంట వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లుకు తరలించాలని సిబ్బందికి సూచించారు. అలాగే నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ వీరేశం, ఎపీఓ కుమారస్వామి, ఏఈఓలు నాగరాజు, సుమలత, ఏపీఎం దేవానంద్, రవి, లావణ్య ఉన్నారు.

ఉపాధిహామీ పనులు వినియోగించుకోవాలి



కూల్‌క్యాన్లు అందజేస్తున్న అనిల్

దామెర : ఉపాధిహామీ పనులను కూలీలు వినియోగించుకోవాలని ఏపీఓ శారద సూచించారు. మండలంలోని పసరగొండ చిర్రకుంటలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను ఆమె మంగళవారం పరిశీలించి కూలీల వివరాలను మేట్లను అడిగి తెలుసుకున్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరూ పనులకు హాజరు కావాలని అన్నారు. ఎండ కారణంగా డీ హైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం పులుకుర్తి నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా వనసేవకులకు పలు సూచనలు చేశారు.

కూల్ క్యాన్ల వితరణ

మండలంలోని దమ్మన్నపేట్‌లో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీల కోసం పీఏసీఎస్ డైరెక్టర్ దుబాసి అనిల్ కూల్ క్యాన్లను అందజేశారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సమ్మిరెడ్డి

వేలేరు : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఆయా శాఖల అధికారులు తమ ప్రగతినివేదికను చదివి వినిపించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీరు క్రమం తప్పకుండా సరాఫరా చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఎంపీపీ ఆదేశించారు. ఐకేపీ సెంటర్లలో రైతులకు, హమాలీలకు తగిన ఏర్పాట్లు చేయాలని, తరుగు, తాలు పేరిట కట్టింగ్‌లు పెట్టకుండా మిల్లర్లతో ఎప్పటికప్పుడు సమన్వయం అవ్వాలని ఆశాఖ అధికారులకు సూచించారు. ఆర్టీసీ బస్సులు గ్రామాలకు సరిగా రావడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో మంజూరైన పనులను త్వరగా పూర్తి చేసేవిధంగా విద్యాశాఖ అధికారులు చొరవచూపాలని అన్నారు. కాగా సర్వసభ్య సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరుకాలేదు. వైస్ ఎంపీపీ సంపత్, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏడున్నర ఏళ్లుగా మారని దుస్థితి

- జిల్లా కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం
- దూరభారంతో తప్పని ఇబ్బందులు
- పాలకులు, అధికారులు స్పందించాలని వేడుకోలు



హనుమకొండ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ఐనవోలు మండల పరిషత్ కార్యాలయం

ఐనవోలు : ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేసేందుకు 2016లో ఐనవోలును నూతన మండలంగా అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ మండల మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో ఏడున్నర ఏళ్లుగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రంలో కావాల్సినంత ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉండటమేకాక తాత్కాలిక భవనాలు కూడా ఉన్నాయి. అయినా మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటు చేయకపోవడంతో పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శణంగా మారిందని ఆరోపణలు ఉన్నాయి.

మూడు ముక్కలను అతికించి

ఐనవోలు మండల ఏర్పాటుకు మూడు మండలాల నుంచి వివిధ గ్రామాలను ఎంపిక చేసి 17 గ్రామాలతో మండలంగా ఏర్పాటు చేశారు. పూర్వ వర్ధన్నపేట మండలం నుంచి 9 గ్రామాలు, హనుమకొండ మండలం నుంచి 4, జఫర్‌ఘడ్ మండలం నుంచి 2 గ్రామాలతో పాటు నూతనంగా ఏర్పడిన 2 గ్రామ పంచాయతీలతో కలిపి మొత్తం 17 గ్రామాలు సుమారు 50 వేల జనాభాతో మండలంగా ఆవిర్భవించింది. ఐనవోలు మండలం వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉంటే మండల పరిషత్ కార్యాలయం వరంగల్ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గంలో కొనసాగుతోంది. గ్రామాలకు ఆయా పూర్వ మండల కేంద్రాలు, మండల పరిషత్, ఇతర త్రా కార్యాలయాలు గరిష్ఠంగా 12 కిలోమీటర్ల దూరంలో ఉండేవి. ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయం మాత్రం 30 కిలోమీటర్ల దూరంలోని హనుమకొండ నగరంలో ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ సమస్యల పరిష్కారానికి ఫిర్యాదులు, వినతులు ఇచ్చేందుకు మండల పరిషత్‌కు వెళ్లాలంటే 30 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సు, ఆటోలో వరంగల్‌కు వెళ్లి అక్కడ నుంచి రెండు చోట్లు ఆటోలు మారడంతో పాటు కాలినడన అరకిలోమీటరు నడిస్తే కాని మండల పరిషత్ కార్యాలయానికి చేరుకునే పరిస్థితి లేదన్నారు. ఒక రోజు వ్యవసాయ, కూలి పని వదిలేసి రూ. 200 ఖర్చు చేసుకుని వెళ్తే సమయానికి అధికారులు అందుబాటులో ఉండడం లేదని వాపోతున్నారు. గతంలో మండల, జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని పలువురు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో 'కేఆర్' హామీ

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే పాలకులు, అధికారులను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. నాలుగన్నర నెలలు గుడుస్తున్నా సమస్య పరిష్కారం కాలేదని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతానికి మండల కేంద్రంలో తాత్కాలికంగా ప్రజాపరిషత్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పాలకులు పట్టించుకోవడం లేదు



చిన్న మండలంగా ఏర్పడిన ఐనవోలులో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను గతంలో పలుమార్లు కోరినాం. సామాన్యుడు మండల పరిషత్‌కు వెళ్లాలంటే రూ.200 వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఎమ్మెల్యే దృష్టి సారించి మండల పరిషత్ కార్యాలయాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలి.

-గబ్బెట రాంకుమార్, గర్మిళ్లపల్లి, ప్రజా సంఘాల నాయకుడు

దూరభారంతో ఇబ్బంది పడుతున్నాం



మండల పరిషత్ కార్యాలయం జిల్లా కేంద్రంలో ఉండడంతో ఆటో, బస్సు చార్జీలు భారమవుతున్నాయి. ఒకరోజు పని మానేసుకొని వెళ్తున్నాం. మండల కేంద్రంలో ఉంటే అధికారులతో ప్రజలకు మేలు జరుగుతుంది. అధికారులు, పాలకులు స్పందించి మండల కేంద్రంలోనే కార్యాలయాన్ని ఏర్పాటు చేసి అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

-గుండపు చిన్న సత్యనారాయణ, కక్కిరాలపల్లి, రైతు

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



ఐనవోలు : బీఎస్పీ మండల కోఆర్డినేటర్ కట్కూరి శ్రావణ్ మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ మేరకు వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కండువా కప్పి ఆహ్వానించారు. అదేవిదంగా వనమాల కనపర్తి మాజీ ఉపసర్పంచ్ మడ్డి కిషన్ బీఆర్‌ఎస్‌లో చేరారు. వైస్ ఎంపీపీ మోహన్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఉస్మాన్‌అలీ ఉన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

కమలాపూర్ : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు ఉప్పల్‌లో మంగళవారం రాత్రి హనుమాన్ మాలధారులు, భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై హనుమాన్, శ్రీరాముని చిత్రపటాలను ఉంచి హనుమాన్, రామ సంకీర్తనలు అలపిస్తూ నృత్యాలు చేస్తూ స్థానిక పనగట్ల నుంచి బస్టాండ్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్, రామ నామ స్మరణతో పురవీధులు మారుమోగాయి.

పరకాల : హనుమాన్ జయంతి సందర్భంగా విశ్వహిందు పరిషత్ పరకాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం శోభయాత్ర నిర్వహించారు. పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానం నుంచి ప్రారంభమైన హనుమాన్ శోభయాత్ర.. పురవీధుల గుండా ఏబీవీపీ శక్తిస్థల్ వరకు కొనసాగింది. వీహెచ్‌పీ కార్యకర్తలు శేషు, గిరిప్రసాద్, శివప్రసాద్, దార్న సునీల్, గురుప్రసాద్, గాజుల నిరంజన్, హిందుభక్తులు పాల్గొన్నారు.